15,16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు

- 9 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం
- హాజరుకానున్న 5.51 లక్షల మంది అభ్యర్థులు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. డిసెంబర్ 15,16 తేదీల్లో పరీక్షలు నిర్వహించన్నది. ఈ మేరకు గురువారం టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ వివరాలు వెల్లడించారు. సుమారు 5.51 లక్షల మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లుచేస్తున్నట్టు తెలిపారు. డిసెంబర్ 15న ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్, మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు పేపర్-2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ, డిసెంబర్ 16న ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్, మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు పేపర్-4 తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పరీక్షలు నిర్వహించనున్నట్టు వివరించారు. డిసెంబర్ 9 నుంచి హాల్‌టికెట్లు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలు ఎదురైతే 040-23542185, 23542187 నంబర్లలో ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీ యూటీఎఫ్ అధ్యక్షురాలిగా విశాలక్షి

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తేతెలంగాణ): కస్తూర్బా, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షురాలిగా సంగారెడ్డి జిల్లా కు చెందిన విశాలక్షి, ప్రధాన కార్యదర్శిగా యాదాద్రి భువనగిరికి చెందిన సీహెచ్ లక్ష్మి ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్ లోని యూ నియన్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా మంజుల(మహబూబాబాద్), ఉపాధ్యక్షులుగా గోపీలత, మీనా, సూర్యకిరణ్, రేణుక, రాజకుమారి, టీనా, నారాయణమ్మ, గంగమణి, కార్యదర్శులుగా సుమన చైతన్య, శ్రీలత, స్వరూప, కిష్టయ్య, రాజాబాయి, సంధ్య, సావిత్రి, కుమారస్వామి, శోభారాణిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, రవి అభినందించారు.

అడగకుండా అటానమస్ ఎలా ఇస్తారు?

- యూజీసీకి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఘాటు లేఖ

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తేతెలంగాణ): ప్రైవేట్ ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలకు 'అటానమస్' హోదా చినికిచినికి గాలివానలా మారుతున్నది. ఈ వ్యవహారం యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మధ్య వివాదానికి దారితీసింది. తమను సంప్రదించకుండానే తమ పరిధిలోని కాలేజీలకు స్వయం ప్రతిపత్తి ఇచ్చేందుకు అత్యుత్సాహం ఎందుకని ఉన్నత విద్యామండలి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు ఘాటుగా లేఖ రాసినట్టు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

కాలేజీలకు ఫుల్ డిమాండ్

యూజీసీ అటానమస్ హోదా ఉన్న కాలేజీలకు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ కళాశాలల్లో అత్యున్నత ప్రమాణాలు, నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు ఉంటాయనే ఉద్దేశంతో విద్యార్థులు ఈ కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఈ కాలేజీల్లో అడ్మిషన్లయితే అటానమస్ కల్పించే విషయంలో తమ ప్రమేయం లేకుండా చర్యలెలా తీసుకుంటారని ఉన్నత విద్యామండలి అడ్డు చెప్తున్నది.

గ్రేడ్ల మార్పుతో చిక్కులు

గతంలో న్యాక్ ఏ గ్రేడ్, లేదంటే కనీసం మూడు కోర్సులు 675 స్కోర్‌తో ఎన్‌బీఎ గుర్తింపు ఉంటే అటానమస్ హోదా ఇచ్చేవారు. ఇటీవల ఈ నిబంధనల్లో యూజీసీ మార్పులు చేసింది. ఏ గ్రేడ్‌కు బదులు బీ గ్రేడ్ ఉన్నా అటానమస్ కల్పిస్తున్నది. దీంతో ఈ హోదా ఉన్న ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల సంఖ్య 430కి చేరిందని విద్యామండలి అధికారులు చెప్తున్నారు. అటానమస్ హోదా ఉన్న కాలేజీలకు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం అంతా ఆయా కాలేజీల పరిధిలోనే ఉంటుంది.

రాష్ట్రంలో అదానీ ప్రకంపనలు

- లంచం ఆరోపణలపై అమెరికాలో అదానీపై కేసు
- మోదీ, అదానీ బంధంపై రాహుల్‌గాంధీ విమర్శలు
- రాష్ట్రంలో అదానీతో అల్లుకుపోతున్న రేవంత్‌రెడ్డి
- అదానీ కొడుకు కరణ్‌తోనూ పలుమార్లు సమావేశం
- స్కిల్ వర్సిటీకి అదానీ రూ. 100 కోట్ల విరాళం
- తాజా పరిణామాలతో రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు వ్యవహారం రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి, అదానీ బంధంపై అనుమానాలు రేకెత్తిస్తున్నది. వీరి బంధంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేసిన వారంతా ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. సొంత పార్టీ కాంగ్రెస్‌లోనూ ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. అక్కడే అంత ముట్టినప్పుడు, ఇక్కడ ఎంత 'ముట్టాయో' నంటూ రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఒప్పందాలు చేసుకున్న ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ నేతలకు లంచాలు ఇస్తున్న అదానీ తెలంగాణలో మాత్రం ఎందుకు ఇవ్వకుండా ఉంటారనే చర్చ జరుగుతున్నది. రేవంత్, అదానీ బంధం 'పవిత్ర బంధం' కాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో సోలార్ విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందంలో పలు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలకు అదానీ గ్రూప్ రూ. 2029 కోట్ల లంచాలు ఇచ్చినట్టు అరోపణలు ఉన్నాయి. దీనిపై అమెరికాలోని న్యూయార్క్‌లో అదానీపై అవినీతి కేసు నమోదైంది.

రాహుల్ వద్దన్నా... రేవంత్ చెట్టాపట్టాల్

రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదానీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన దేశాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. అయితే ఇవన్నీ డ్రామాలేనని తేలిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అదానీతో బంధం కోసం రేవంత్‌రెడ్డి వెంపర్లాడారనే విమర్శలున్నాయి. ఇచ్చిపుచ్చుకున్న వ్యవహారంలో ఇద్దరి మధ్య బలమైన బంధం ఏర్పడిందనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా రేవంత్‌రెడ్డి, అదానీ మధ్య బంధం ఏర్పడిందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఇద్దరూ పరస్పర భిన్నంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. అదానీని రాహుల్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే రేవంత్‌రెడ్డి మాత్రం ఆయనతో బంధం పెంచుకోవడానికి ఇష్టపడటం విమర్శలకు తావిస్తున్నది. మోదీ, అదానీ ఒకటేనని, ప్రధాని మోదీ దేశ సంపదను అదానీకి దోచి పెడుతున్నారంటూ రాహుల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అదే పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో అందుకు పూర్తి భిన్నమైన విధానాన్ని ఎంచుకున్నారు. ఆయనతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారు.

తండ్రీకొడుకులతో రేవంత్ భేటీ

గౌతమ్ అదానీ, ఆయన కుమారుడు కరణ్ అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు భేటీ అయ్యారు. కొన్నిసార్లు అధికారికంగా భేటీ కాగా మరికొన్ని సార్లు రహస్యంగా భేటీ అయినట్టు తెలిసింది. పైకి ప్రభుత్వ ఒప్పందాలని చెప్తూనే లోలోపల ఏదో గూడుపుఠానీ జరిగిందనే ఆరోపణలున్నాయి.. రేవంత్‌రెడ్డి, అదానీ ఈ ఏడాది జనవరి 23న దావోస్‌లో భేటీ కాగా, మరోసారి అక్టోబర్ 18న హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. అదానీ కుమారుడు కరణ్ అదానీ జనవరి 3న సచివాలయంలో భేటీ అయ్యారు. ప్రభుత్వంలో నంబర్ 2గా చెప్పుకొంటున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటు అదానీ, అటు కరణ్ అదానీతో రహస్యంగా భేటీ అయినట్టు వార్తలొచ్చాయి. అక్టోబర్ 3న అదానీతో పొంగులేటి భేటీ అయినట్టుగా తెలిసింది. అంతకు ముందు తన ఇంట్లోనే కరణ్‌తో రహస్యంగా భేటీ అయినట్టు తెలిసింది.

ఆడబిడ్డకో న్యాయం అదానీకి మరో న్యాయమా!

మొదటిపేజీ తరువాయి...

> భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా? అని నిలదీశారు. 'ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా? ఎన్నిసార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని.. అదానీ వైపేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవినీతి ఆరోపణలు... అయినా ఒప్పందాలు

అదానీ కంపెనీలపై దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. ఈ కంపెనీ తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడిందనే ఆరోపణలున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం అనేకసార్లు అదానీపై ఆరోపణలు గుప్పించారు. ప్రపంచం మొత్తం అదానీని వ్యతిరేకిస్తుంటే రేవంత్‌రెడ్డి మాత్రం అదానీని అక్కున చేర్చుకుని వరుస ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 23న దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో అదానీ కంపెనీలతో రూ. 12,400 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే స్కిల్ యూనివర్సిటీ కోసం అదానీ కంపెనీ రూ. 100 కోట్లు విరాళం ఇచ్చింది. అదానీ స్వయంగా హైదరాబాద్ వచ్చి సచివాలయంలో రేవంత్‌రెడ్డికి చెక్ అందజేశారు. భువనగిరి జిల్లా రామన్నపేటలో అదానీ సంస్థ నిర్మించబోయే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తున్నది. పాతబస్తీలో విద్యుత్ బిల్లుల వసూలు, రెగ్యులేషన్ బాధ్యతను కూడా అదానీ కంపెనీకి ప్రభుత్వం అప్పగించినట్టు అప్పట్లో వార్తలొచ్చాయి.

బంధం, ఒప్పందాలపై అనుమానాలు

అమెరికాలో అదానీపై అవినీతి కేసు నమోదు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోలార్ విద్యుత్తు కొనుగోలులో లంచాలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగిలిన ఒప్పందాల్లోనూ ఇదే రకమైన అవినీతి జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్న కంపెనీని ఆహ్వానించి మరీ ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అదానీ కంపెనీలతో ఒప్పందాలను సమర్థించుకోవడం గమనార్హం. బరాబర్ ఒప్పందాలు చేసుకుంటామని, పెట్టుబడులు పెట్టిస్తామని కుండబద్దలు కొట్టడం గమనార్హం.

రాహుల్ వ్యాఖ్యలు రేవంత్ గురించి కాదు: భట్టి

అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో దేశంలో ఆయనతో అంటకాగిన ప్రతి ఒక్కరిపైనా కేసు పెట్టాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రేవంత్ గురించి కాదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. దేశ సంపద, వనరులను అదానీకి అప్పగిస్తున్నారంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీపై భట్టి తీవ్ర ఆరోపణలు చేశారు. అదానీ విషయంలో రాహుల్‌గాంధీ స్టాండ్‌కు కట్టుబడి ఉంటామని, ఆయన ఆలోచనలను సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రి వర్గం పాటిస్తుందని స్పష్టం చేశారు. అదానీపై అమెరికాలో కేసు నమోదు కావడంతో, ఆయనతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై బీఆర్ఎస్ విమర్శలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో స్పందించిన భట్టి.. అదానీ విషయంలో మోదీని విమర్శిస్తూనే.. తెలంగాణలో అదానీ పెట్టుబడులను మాత్రం సమర్థించుకున్నారు. అదానీకి తాము రాష్ట్రాన్ని కట్టబెట్టడం లేదని చెప్పారు. రాష్ట్రంలోకి ఎవరైనా రావొచ్చని, ఎవరైనా పోవచ్చని చెప్పడం గమనార్హం.

అదానీతో అంటకాగిన అందరికీ శిక్ష పడాలి

- ఏ పార్టీ వారైనా విచారణ జరిపించాల్సిందే
- అదానీతో రేవంత్ సర్కార్ డీల్‌పై రాహుల్ కీలక వ్యాఖ్యలు

అదానీపై అమెరికాలో అవినీతి కేసు నమోదు కావడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందించారు. ఆది నుంచి తాము చెప్తున్నదే ఇప్పుడు నిజమవుతున్నదని పేర్కొన్నారు. దేశంలో అదానీతో అంటకాగిన ప్రతి ఒక్కరిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. వారు ఏ పార్టీ వారైనా విచారణ జరిపించాల్సిందేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో వేళ్లన్నీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డిని చూపుతున్నాయి. రాహుల్ పరోక్షంగా రేవంత్‌రెడ్డిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో అదానీని వ్యతిరేకిస్తుంటే రాష్ట్రంలో మాత్రం రేవంత్ ఇందుకు విరుద్ధంగా అదానీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడంపై జాతీయ నాయకత్వం గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అదానీపై కేసుతో ఆయనతో కలిసున్న అందరిపైనా కేసు పెట్టాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి పరిణామాలు జరుగుతాయనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది.

దేవాదాయశాఖ మంత్రి లిక్కర్ దావత్!

- కొండా సురేఖ వీడియోకాల్ వైరల్
- ఎక్కువ డ్యాన్స్ చేస్తే ఎక్కువ మందు
- మనుమరాలి బర్త్‌డే పార్టీలో ఆఫర్
- సోషల్ మీడియాలో నెటిజన్ల విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మరోసారి వార్తల్లో నిలిచారు. కొండా సురేఖ, ఓ మహిళ మధ్య జరిగిన బండ బూతుల సంభాషణ అంటూ ఆ మధ్య ఓ ఆడియో నెట్టింట్లో తెగ వైరల్ అయింది. ఆ తర్వాత స్వయంగా కొండా సురేఖ కెమెరాల ముందు అభ్యంతరక వ్యాఖ్యలు చేశారు. మాజీమంత్రి కేటీఆర్, సినీనటుడు నాగార్జున కుటుంబం గురించి ఇష్టారీతిన మాట్లాడటంతో హైకోర్టు మొట్టికాయలు వేసింది. నాగార్జున వేసిన పరువు నష్టం కేసు నడుస్తున్నది. ఇలా వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తున్న కొండా సురేఖ మరోసారి నెటిజన్ల చేతిలో బుక్కయ్యారు. సురేఖ మాట్లాడిన వీడియో కాల్ రికార్డుగా చెబుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. అందులో ఓ యువతితో సురేఖ మట్లాడుతూ "ఈ రోజు మా అందరికీ పండుగ ఉంది. బిర్యానీలు తెప్పిస్తా ఉన్నము.. చిన్న పాప పేరుతోటి. మా టీమ్ టీమంతా కూడా ఇవాళ ఫుల్ ఎంజాయ్. బిర్యానీ ఉంటే బీర్ ఉంటది కదమ్మా పాపమ. అఫీషియల్ సెలేబ్రేషన్ అంటే అఫీషియల్‌గా ఇచ్చేది. ఇగ అన్‌అఫీషియల్‌గా అంటే.." అన్నారు. మరో వీడియోలో "ఎవరు ఎక్కువ డ్యాన్స్ చేస్తే వాళ్లకు మందు ఎక్కువ అని చెప్తున్నా" అన్నారు. మూడో వీడియోలో "బిర్యానీలు నడుస్తున్నయి.. అట్లనే సల్లవడుడు కూడా నడుస్తున్నది" అని మంత్రి మాట్లాడారు. ఇప్పుడు ఈ వీడియోలపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. సురేఖ ఇంటిలో పోలీసులు సోదాలు చేయాలని, పార్టీకి పర్మిషన్ ఉందా? మందు పార్టీనా? డ్రగ్స్ పార్టీనా? రేవ్ పార్టీనా? తేల్చాలని కొందరు పోస్టులు పెడుతున్నారు.

ఇంటి నంబర్ కోసం 30 వేలు లంచం

ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

సచిన్‌కుమార్

అమీన్‌పూర్, నవంబర్ 21 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి ఐలాపూర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సమయంలో లంచం డిమాండ్ చేసిన కేసులో సచిన్ కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ కథనం ప్రకారం.. ఐలాపూర్‌కు చెందిన మల్లేశ్ ఇంటి నంబర్ కోసం కార్యదర్శి సచిన్‌ను సంప్రదించగా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. మొదట రూ.10 వేలు ఇచ్చాడు. మరో రూ.20 వేలు ఇస్తానని చెప్పిన మల్లేశ్ కార్యదర్శిపై ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. సెప్టెంబర్ 29న బీరంగూడ రావాలని పిలిపించుకొని లంచం డిమాండ్ చేసిన మాటలను మల్లేశ్ రికార్డు చేశాడు. ఈ రికార్డు ఆధారాలను ఏసీబీకి అందజేశాడు. కాగా సచిన్ ఇటీవలే సదాశివపేట మండలం ఆత్మకూర్‌కు బదిలీపై వెళ్లారు. అధికారులు గురువారం సచిన్ ను అమీన్‌పూర్ కార్యాలయానికి పిలిపించి సచిన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

20 వేలు లంచం తీసుకుంటూ..

ఏసీబీకి చిక్కిన జ్యోతి క్షేమాబాయి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 21: మహబూబాబాద్ కలెక్టరేట్‌లో లంచం తీసుకుంటూ సీనియర్ డ్రాఫ్ట్‌మెన్ ఏసీబీకి పట్టుబడింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు.. వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన యువకుడు తాళ్ల కార్తీక్ మహబూబాబాద్ శివారులో మూడు ఎకరాలు కొనేందుకు సిద్ధమయ్యాడు. ఈ భూమి సర్వే నంబర్లు, వివాదాలకు సంబంధించిన వివరాల కోసం నక్షకు కలెక్టరేట్‌లోని సర్వే, భూమి రికార్డుల విభాగంలో గత నెల 28న దరఖాస్తు చేశాడు. దీనికి సంబంధించి సీనియర్ డ్రాఫ్ట్‌మెన్ జ్యోతి క్షేమాబాయి చలానా తీయాలనగా 5 వేలు ఇచ్చాడు. రెండ్రోజుల తర్వాత నక్ష మ్యాప్ కోసం ఆఫీస్‌కు వెళ్లగా రూ.20 వేలు ఇస్తేనే మ్యాప్ వస్తుందని జ్యోతీక్షేమాబాయి చెప్పింది. గురువారం ఉదయం 11.30 గంటలకు ఆమెకు 20 వేలు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

బెల్ట్ షాపులను నిషేధించాలని జనగామలో వినూత్న ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బెల్ట్ షాపులపై మిలిటెంట్ ఉద్యమం

- సీపీఎం జనగామ నాయకుల హెచ్చరిక
- వినూత్న నిరసన, ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

జనగామ, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లాలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని నియంత్రించకపోతే మిలిటెంట్ ఉద్యమం చేయక తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం జనగామలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు మద్యం మహమ్మారి భూతం వేషధారణతో వినూత్న నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించి సుమారు 4 గంటల పాటు వందలాది మంది మహిళలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో బెల్ట్ షాపులను నిషేధించి ప్రజలను రక్షిస్తానని ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. బ్రాందీ, లిక్కర్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపుల ద్వారా అక్రమ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం నాయకులు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనితతో ఫోన్‌లో మాట్లాడగా డిసెంబర్ నెలాఖరులోగా బెల్ట్ షాపులను అరికడతామంటూ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

చూస్తారా.. కూల్చివేస్తారా?

- జంట జలాశయాల కింద పెద్దల భారీ ఆక్రమణలు
- పేదల ఇండ్లు కూల్చిన హైడ్రా ఇప్పుడేం చేస్తుంది?
- జలాశయాల పరిధిలో రేపు రంగనాథ్ పర్యటన
- హైడ్రా తదుపరి కార్యాచరణపై సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబరు 21(నమస్తే తెలంగాణ): దశాబ్దాలుగా హైదరాబాద్ తాగునీటి వనరులైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిధిలోని పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కొన్ని కట్టడాలను కూల్చింది. కానీ జలాశయాల పరిధిలోని బడాబాబుల భవంతుల జోలికి వెళ్లలేదు. పేదలకు ఓ న్యాయం, పెద్దలకు మరో న్యాయమా అంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం జంట జలాశయాల పరిధిలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ ఎలాంటి చర్యలు చేపడుతారో అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

వీటినేం చేద్దాం?

జల వనరుల పరిధిలోని ఆక్రమణల తొలగింపే ప్రభుత్వ ధ్యేయమని సీఎం రేవంత్‌రెడ్డి పలు వేదికలపై చెబుతున్నారు. ఆచరణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు జలాశయాలకు 500 మీటర్ల మేర నిర్మాణాలు ఉండొద్దనే గతంలోనే పురపాలకశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. కానీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గృహం గండిపేట పరిధిలోనే ఉన్నది. శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపీ భాగస్వామిగా ఉన్న శ్రీనిధి విద్యా సంస్థల భవన సముదాయం, కాంగ్రెస్ సీనియర్‌నేత కేవీపీ రామచంద్రరావుతో పాటు చాలా మంది ప్రముఖుల నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయి. జలమండలి నిర్వహించిన సర్వేలోనూ ప్రముఖుల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తేలింది.

చూసేందుకా.. కూల్చేందుకా?

గండిపేట పరిధిలో సర్వే చేసిన జలమండలి, నీటిపారుదల, రెవెన్యూశాకలు ఆక్రమణల జాబితాను సిద్ధం చేశాయి. ఏయే భవనాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయో నిర్ధారించాయి. ఆగస్టు 18న గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ పలు నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఆ తర్వాత పెద్దల భవనాలు ఎందుకు కూల్చడం లేదని పలువురు ప్రశ్నించారు. కానీ హైడ్రా అధికారులు అటువైపు చూడలేదు. కానీ శనివారం జంట జలాశయాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలిస్తారని అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఆక్రమణలుగా ఉన్న పెద్దల బంగ్లాలను చూడడానికి వెళ్తున్నారా? లేకపోతే కూల్చుతారా? అని చర్చ జరుగుతున్నది. జలాశయాలు కలుషితం కాకుండా తీసుకునే చర్యలు, అభివృద్ధి, బాపూ ఘాట్ వద్ద గాంధీ భారీ విగ్రహ ఏర్పాటు ప్రణాళికలను పరిశీలిస్తారని తెలుస్తున్నది.

7న ఆటోబంద్

మొదటిపేజీ తరువాయి...

ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర సంబురాలు చేసుకుంటున్నదని మండిపడ్డారు. ఆటోకార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.15వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, ఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్, హైదరాబాద్ ఓనర్ అసోసియేషన్స్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సలీం, టీఏడీయూ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే అగ్నిప్రమాదాలు

- అటవీ ప్రమాదాలతో జీవపరిణామ వ్యవస్థకు భంగం
- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఐజీ ఎస్ రాజేశ్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): మానవ తప్పిదాలతోనే అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, దీంతో జీవ పరిణామ వ్యవస్థకు భంగం కలిగే ప్రమాదం ఉన్నదని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఐజీ ఎస్ రాజేశ్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్ పేర్కొన్నారు.'అ